నేడు యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి – అమలాపురం

స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి భవన్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఈ నెల 25వ తేదీ సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి యథావిధిగా నిర్వహిస్తారని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను అధికారులు స్వీకరిస్తారన్నారు. ప్రజా సమస్యలను పరిష్కార వేదిక నందు అర్జీల ద్వారా అందిన సమస్యలను నమోదు చేసుకుని వారి సమస్య లకు పరిష్కారాలు తెలియజేస్తారన్నారు. ప్రజా సౌకర్యార్థం ఈ ప్రజా సమస్య ల పరిష్కార వేదిక కార్యక్ర మం అన్ని డివిజన్, మండల స్థాయిలో మరియు మున్సిపల్ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తారని అన్నారు. అర్జీదా రులు తమ సమస్యలను నమోదు చేసుకుని పరి ష్కారం పొందే దిశగా ఈ అవకాశాన్ని సద్వినియో గం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

వణుకుతున్న జిల్లా

- క్రమంగా పెరుగుతున్న చలి తీవ్రత
- పొగ మంచుతోనూ అవస్థలు
- ఉన్నిదుస్తులకు పెరిగిన డిమాండ్

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం ప్రతినిధి

చలిపులి పంజాకు జిల్లా వణుకుతోంది. రాత్రి ఉష్ణోగ్రతలతో క్రమంగా పడిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. చలికి తోడు శీతలగాలుల తీవ్రత ఎక్కువైంది. వారం రోజుల్లో రాత్రి ఉష్ణోగ్రతలు ఒక్కసారికిగా 4 నుంచి 6 డిగ్రీల వరకూ పడిపోయాయి. ఫలితంగా చలితో జిల్లా వణుకుతోంది.

రోజు రోజుకూ తీవ్రత పెరగడంతో ప్రజలు వణికిపోతున్నారు. వారం రోజుల క్రితం జిల్లాలో సరాసరి పగటి ఉష్ణోగ్రత 30 డిగ్రీలుగా నమోదు కాగా రాత్రి ఉష్ణోగ్రతలు 21 డిగ్రీలకు పడిపోయాయి. గత మూడు రోజుల నుంచి రాత్రి ఉష్ణోగ్రతలు 20 డిగ్రీలోపు నమోదయ్యాయి. 15 రోజుల క్రితం కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25 డిగ్రీల వరకు ఉండగా వారం రోజుల్లో గణనీయంగా పడిపోయాయి. మరో వైపు ఉదయం వేళల్లో పొగ మంచు ఉదయం 10 గంటలవరకూ కమ్మేస్తోంది. దీంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం వేళల్లో చలిగాలుల తీవ్రత ఎక్కువయ్యింది. చలితో పాటు శీతలగాలులు వీస్తుండటంతో చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఉబ్బసం, జలుబు, తదితర శ్వాసకోశ వ్యాధులు ఉన్నవారు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. చలిగాలులు వీస్తాయని, రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతాయని వాతావరణశాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. కోనసీమ ప్రాంతంలోని సఖినేటిపల్లి, అంతర్వేది, మలికిపురం మండలాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. కాకినాడ జిల్లా రౌతులపూడి, కోటనందూరు, యు.కొత్తపల్లి, తొండంగి మండలాల్లో ఉదయం 11 గంటలైనా చలి తీవ్రత తగ్గట్లేదు. సముద్ర తీర ప్రాంతాలను పొగమంచు కప్పేస్తుంది.

కోనసీమలో కప్పేసిన పొగ మంచు

వారం రోజులు నమోదైన ఉష్ణోగ్రతలు

తేదీ	గరిష్టం	కనిష్టం
24.11.24	32.2	21.2
23.11.24	32.1	20.0
22.11.24	31.0	21.0
21.11.24	31.5	23.1
20.11.24	32.7	23.2
19.11.24	32.4	24.8
18.11.24	34.1	25.2

ఉష్ణోగ్రతలు డిగ్రీల్లో

వృద్ధులు, చిన్నారులపై తీవ్ర ప్రభావం

చలి తీవ్రత వృద్ధులు, చిన్నారులపై ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. చలి నుంచి కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. స్వెటర్లు, ఊలు టోపీలు, రగ్గులు, జర్కిన్లు వంటివి ధరించాలని చెబుతున్నారు. చర్మ పొడిబారి చర్మ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, దీని నుంచి కొబ్బరి నూనెను రాసుకోవాలని సూచిస్తున్నారు. లేదా మార్కెట్‌లో లభించే లోషన్లను నాణ్యతగలవి రాసుకోవాలన్నారు. అయినప్పటికీ చర్మ వ్యాధులు తగ్గకపోతే డాక్టర్‌ను సంప్రదించాలని సూచిస్తున్నారు. చలి తీవ్రత పెరిగే న్యూమోనియా వంటివి వస్తాయన్నారు. దగ్గు, రొంపలతో శ్వాస తీసుకోవడానికి ఇబ్బందులు వస్తాయన్నారు. ఆవిరి పట్టుకుంటే కొంత ఉపశమనం పొందే అవకాశం ఉందన్నారు. చలిలో చిన్నారులు, వృద్ధులు తిరగకుండా చూసుకోవాలన్నారు.

రాజమహేంద్రవరంలో ఉన్ని దుస్తుల దుకాణం

పిఠాపురంలో చలిమంట వద్ద చిన్నారులు

ఉన్ని దుస్తులకు పెరిగిన డిమాండ్

చలి తీవ్రత పెరుగుతుండటంతో ఉన్ని దుస్తులకు డిమాండ్ పెరిగింది. ఇప్పటికే జిల్లాలో పలుచోట్ల ఉన్ని దుకాణాలు వెలశాయి. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్‌లకు చెందిన చిరువ్యాపారులు ఇక్కడ తాత్కాలిక షాపులను ఏర్పాటు చేసుకుని ఉన్ని దుస్తులను విక్రయిస్తున్నారు. చలి తీవ్రత పెరగడంతో కొనుగోళ్లు పెరిగాయని వారు చెబుతున్నారు. రూ.200 నుంచి రూ.4వేల వరకూ విలువ చేసే ఉన్ని దుస్తులు వీరి వద్ద అందుబాటులో ఉన్నాయి. స్వెటర్లు, గ్లౌజులు, మంకీ క్యాప్‌లు, రగ్గులు, బెడ్‌షీట్లు, జర్కిన్లు ఇలా పలురకాల దుస్తులు అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి వృద్ధుల వరకూ అందుబాటులో ఉన్నాయి. అందుబాటు ధరల్లో దొరకడంతో సామాన్యులు ఎక్కువగా వీటివైపు మొగ్గుచూపుతున్నారు. ఇదిలా ఉండగా పల్లెలో ప్రజలు మంటలు వేసుకుని చలి నుంచి ఉపశమం పొందుతున్నారు.

ఎంఎల్‌ఎ వేగుళ్లకు అభినందనలు

రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ వేగుళ్లకు అభినందనలు తెలుపుతున్న టిడిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి – మండపేట

రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావుకు నియోజకవర్గం నలుమూలల నుంచి అభినందనలు వెల్లువెత్తుతు న్నాయి. వేగుళ్లకు అభినందనలు తెలిపేందుకు వచ్చిన కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో మండపేట టిడిపి కార్యాలయం వద్ద పండగ వాతావరణం నెల కొంది. పట్టణ టిడిపి కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ వేగుళ్లను దుశ్శాలువాలతో సన్మానించి, అభినందనలు తెలియజేశారు. పలువురు ఆయనతో కేక్ కట్ చేయించారు. పలు సంఘాల నాయకులు, గ్రామాలు, వార్డుల నుంచి నాయకులు, కార్య కర్తలు తరలివచ్చి వేగుళ్లకు అభినందలు తెలియజేశారు.

వేగుళ్లను సత్కరించిన ఎమ్ఆర్‌పిఎస్ నాయకులు

రాష్ట్ర అంచనాలు కమిటీ ఛైర్మన్‌గా ఎన్నికైన ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావును ఎమ్ఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు బుంగ సంజయ్ మాదిగ ఆదివారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచి నాయకునికి సముచిత గౌరవం దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని సంజయ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు, కౌన్సిలర్ సవరపు సతీష్. ముమ్మిడివరపు త్రిమూర్తులు, పల్లేటి సతీష్, తొత్తరమూడి ఇశ్రాయేలు, సిరంగు కైఫ్, కాకాడ బాబీ, మందపల్లి శ్రీను బాబు తదితరులు పాల్గొన్నారు.

'సహకార' ఉద్యోగుల సమస్యలపై పోరాటం

- సిఐటియు జిల్లా అధ్యక్షుడు బలరామ్
- సహకార సంఘాల ఉద్యోగుల జిల్లా మహాజన సభ



మహాజన సభలో పాల్గొన్న నాయకులు, ఉద్యోగులు

ప్రజాశక్తి – ముమ్మిడివరం

సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించడంలో సిఐటియు నిరంతరం పోరాటం చేస్తుందని జిల్లా అధ్యక్షుడు నూకల బలరామ్ పేర్కొన్నారు. మండలపరిధిలోని సిహెచ్.గున్నేపల్లి లో సహకార సంఘాల ఉద్యోగుల జిల్లా మహాజన సభ ఆదివారం జిల్లా అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన బలరామ్ మాట్లాడుతూ సహకార సంఘాల ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడటంలో సిఐటియు ముందుంటుందని అన్నారు. కార్మిక సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని పునరుద్ఘాటి ంచారు.సహకార సంఘాల రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.అజయ్ కుమార్ మాట్లాడుతూ సహకార ఉద్యోగుల వేతన సవరణకు ఆటంకంగా ఉన్న జి.నెం.36ను ప్రభుత్వం సవరించాలన్నారు. 2019 తరువాత నియమించిన సిబ్బందిని యధావిధిగా కొనసాగించాలి డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తోట వెంకటరామయ్య మాట్లాడుతూ ఉద్యోగులకు హెల్త్ కార్డులు మరియు డిసిసిబి వాటా తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని దుయ్య బట్టారు. యూనియన్ రాష్ట్ర కోశాధికారి పి.సత్య నారాయణ మాట్లాడుతూ ఉద్యోగుల వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.వెంకటేశ్వరరావు, కుంపట్ల అయ్యప్ప నాయుడు, మట్టపర్తి జయరామ్, ఉద్యోగు లు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నర్సన్న కళ్యాణోత్సవ పనులకు బహిరంగ వేలం

ప్రజాశక్తి – సఖినేటిపల్లి

వచ్చే ఏడాది ఫిబ్రవరిలోల నిర్వహించే అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాల సంబంధించి వివిధ టెండర్ల బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 4 నుంచి ఫిబ్రవరి 13 వరకు నిర్వహిస్తారన్నారు. స్వామివారి కల్యాణోత్సవాలను పురస్కరించుకొని ఆలయానికి సంబంధించిన వివిధ టెండర్ల బహిరంగ వేలం ను దేవాదాయ శాఖ అధికారి రామలింగేశ్వర రావు పర్యవేక్షణలో నిర్వహించామని తెలిపారు. ఈ మేరకు ఆయా వేలం పలువురు పాల్గొని టెండర్లను సమర్పించినట్లు తెలిపారు.

నాయకుల తాలూకా ఐతే.. నెంబర్లు అక్కర్లేదా?

- వాహనాల రిజిస్ట్రేషన్ నెంబర్లు తొలగిస్తున్న వైనం
- నిబంధనలను అతిక్రమిస్తున్న వాహనదారులు

ద్విచక్రవాహనంపై నెంబర్ ప్లేట్ పై ఇలా..

ప్రజాశక్తి – రామచంద్రపురం

మోటార్ వాహనాలు నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ నెంబర్ తప్పనిసరిగా ప్రభుత్వం సూచించిన నిబంధనల ప్రకారం మోటార్‌సైకిల్ పైనా, ఆటోలు పైనా, లారీల పైనా స్పష్టంగా ముద్రించాల్సి ఉంది. అయితే ఇటీవల ఎన్నికల తర్వాత కొందరు రాజకీయ నాయకుల అండ చూసుకుని మోటార్ సైకిల్ పై రిజిస్ట్రేషన్ నెంబర్లను తొలగించి వాటి స్థానంలో తాము మంత్రి గారి తాలూకాఅని, ఎంపీ గారి తాలూకా అని, లేదా సినిమా హీరోల ఫోటోలు, వంటివి ముద్రిస్తూ నిబంధనలను అతిక్రమిస్తున్నారు. సాధారణంగా మోటార్ సైకిల్ రిజిస్ట్రేషన్ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం రావడమే కాకుండా మోటార్ సైకిల్ ప్రమాదాలు జరిగినప్పుడు, దొంగతనాల గుర్తైనప్పుడు రిజిస్ట్రేషన్ నెంబర్ ఆధారంగా వివరాలు సేకరించేందుకు అటు పోలీసులకు ఇటు వాహనదారులకు ఎంతో ఉపయోగపడే విధంగా ప్రతి రాష్ట్రంలోనూ జిల్లాల్లోనూ రిజిస్ట్రేషన్లు తప్పనిసరి చేశారు. దీంతోపాటు నెంబర్ ప్లేట్లపై ఉండాల్సిన నెంబర్లు వాటి రంగులను కూడా ప్రభుత్వం ఉద్దేశించింది. జిల్లాలో సుమారు నాలుగు లక్షల వరకు మోటర్ సైకిల్ ఉంటాయని అంచనా అయితే గత ఎన్నికల తర్వాత ఎక్కువగా మోటార్ సైకిల్ పై నెంబర్లు తొలగించి తాము మంత్రి గారి తాలూకా, అని, ఎంపీ గారు తాలూకా అని, ఎంఎల్ఎ తాలూకా అని ముద్రిస్తున్నారు. దీంతో మోటార్ వెహికల్ తనిఖీ అధికారులకు తలనొప్పిగా తయారైంది. వీటివల్ల ఆయా మోటార్ సైకిల్ ప్రమాదం గుర్తైనప్పుడు బాధితుల చిరునామాలు తెలుసుకొనేందుకు పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ విధానాన్ని వెంటనే మార్చి మోటార్ సైకిల్ అన్నిటికీ ఒకే విధమైన నెంబర్లు విధానం అమలు చేయాలని పలువురు కోరుతున్నారు.

నిబంధనలు పాటించని వారిపై చర్యలు

మోటారు సైకిళ్లు, వాహనాలు వెనుక నిబంధనలను పాటించని వారిపై చర్యలు తీసుకుంటాం. నిబంధనలను పాటించకుండా పలువురు నెంబర్ ప్లేట్లపై ఇష్టానుసారం ముద్రిస్తున్న బోర్డులను తాము గుర్తించామని అటువంటి వారికి చట్టప్రకారం చర్యలు తప్పవు. దీంతో పాటుగా జరిమానాలు విధిస్తున్నామని ఆయన వివరించారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలి. ఈ మేరకు యువకులకు, విద్యార్థులకు, పలు అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలిపారు.

– ఆర్.రాజేంద్రప్రసాద్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్



నెంబర్ ప్లేట్‌పై నిబంధనలకు విరుద్ధంగా..

రాజకీయ నాయకులు స్పందించాలి

మోటార్‌సైకిల్ పై ఎంఎల్‌ఎ, ఎంపీ, మంత్రి తాలూకా అంటూ వస్తున్న పేర్లను వెంటనే తొలగించాలని ఆయా పార్టీల రాజకీయ నాయకులు స్వయంగా కార్యకర్తలకు వివరించాలని దీని ద్వారా జరిగే నష్టాన్ని వారికి తెలియజేయాలని పలువురు సూచిస్తున్నారు. అదేవిధంగా పోలీసులు వీటిపై ప్రత్యేకంగా ఏర్పాటు చసి ఇటువంటి వాహనాలను గుర్తించి నెంబర్ ప్లేట్లపై యథావిధిగా నెంబర్లు ముద్రించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నెంబర్‌ప్లేట్‌పై ఫొటోతో..

తడాలవారిపాలెం ప్రధాన రహదారి వద్ద సిసి రోడ్డు దుస్థితి

అంచు దిగితే ప్రమాదమే..

ప్రజాశక్తి – పి.గన్నవరం

యర్రంశెట్టివారి పాలెం (వైవి. పాలెం) సమీపంలో తాడాలవారిపాలెం వద్ద సిసి రోడ్డు నివాసాల వైపు బెర్మలు నిర్మించక పోవడంతో ప్రమాదకరంగా మారింది. పి గన్నవరం మండల పరిధిలో గంటి పెదపూడి నుంచి పి.గన్నవరం వరకు కొన్నిచోట్ల సిసి రోడ్లు, కొంతమేర బీటీ రోడ్డు నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ రోడ్డు కొన్నిచోట్ల కాలువ వైపు, మరికొన్నిచోట్ల అక్కడక్కడా బెర్మలు పటిష్ట పరచకపోవడంతో రాత్రి సమయంలో ఏ ముప్పు సంభవిస్తుందోనని వాహనదారుల ఆందోళన చెందుతున్నారు. రాజోలు – రావులపాలెం ప్రధాన ఆర్ అండ్‌బి రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. యర్రంశెట్టి వారి పాలెం (వైవి.పాలెం) సమీపంలో తాడాల వారిపాలెం వద్ద సిసి రోడ్డు నివాసాల వైపు బెర్మలు నిర్మించక పోవడంతో అగాధంగా దర్శనమిస్తుంది. దీనికి తోడు హెచ్చరిక బోర్డులు కూడా లేవు. సంబంధిత అధికారులు బెర్మలు పటిష్ట పరచాలని స్థానికులు విన్నవిస్తున్నారు.

తీర ప్రాంత గ్రామాల్లో తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి – సఖినేటిపల్లి

మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం కష్టాలు పడుతున్నారు. స్టీమర్ రేవు, బాడీ రేవు ప్రాంతాల్లో రెండు రోజులుగా కుళాయి ద్వారా తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో తాగునీటి ట్యాంకర్ ద్వారా ఇంటింటికీ ఉచితంగా నీటిని సరఫరా చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ శ్రేణులకు ఆయా ప్రాంత ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

వర్గీకరణ వ్యతిరేక ఉద్యమానికి సన్నద్ధం

ఈదరపల్లి సమావేశంలో మాట్లాడుతున్న డిబి.లోక్

ప్రజాశక్తి – అమలాపురం రూరల్

ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని సన్నద్ధం చేయాలని మాల సామాజిక వర్గ సమావేశంలో ఉద్యమ కార్యాచరణ పై ముఖ్య నాయకులు పేర్కొన్నారు. ఆదివారం అమలాపురం మండలం ఈదరపల్లి అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన 22 మండలాల నాయకుల సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై నేతలు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా మాలల సత్తా చాటాలన్నారు. ఎస్‌సి వర్గీకరణ నిర్ణయాన్ని తరిమికొట్టాలని, ఆదిశగా ఉద్యమం సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు డిబి.లోక్, జంగా బాబురావు, ఎంఏకె భీమారావు, ఇసుకపట్ల రఘుబాబు, గొల్లపల్లి డేవిడ్ రాజు, గెడ్డం సురేష్ బాబు, జెడ్‌పిటిసి సభ్యుడు పందిరి శ్రీహరి, కోట రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ ఊర్మిళదేవి దంపతులకు సత్కారం

సర్పంచ్ ఊర్మిళ దేవి దంపతులను సత్కరిస్తున్న శ్రీరామ్ పబ్లిబ్ స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మీ గణేష్ దంపతులు

ప్రజాశక్తి – ఉప్పలగుప్తం

విలసవిల్లి నుంచి అమలాపురం రూరల్ మండలం సమనస వెళ్లే రోడ్డు అభివద్ధి కృషి చేసిన విలసవిలి గ్రామ సర్పంచ్ సలాది ఊర్మిళ దేవి, ఆమె భర్త, వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్‌ను ఆదివారం సమనసలో నిర్వహించిన పలువురు ఘనంగా సత్కరించారు. విలసవిల్లి నుంచి అమలాపురం రూరల్ మండలం సమనస వెళ్లేందుకు ఎన్నో ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.ఈ నేపథ్యంలో విలసవిల్లి సర్పంచ్ సలాది ఊర్మిళ దేవి రూ.18 లక్షలు వెచ్చించి ఉపాధి హామీ చట్టం నిధులతో రోడ్డును అభివృద్ధి చేశారు. దీనికి కృతజ్ఞతగా సమనస శ్రీరామ్ పబ్లిక్ స్కూల్లో ఆదివారం సర్పంచ్ ఊర్మిళ దేవి, వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్ దంపతులను స్కూల్ ప్రిన్సిపల్ పి.లక్ష్మీ గణేష్, నాగలక్ష్మి దంపతులు దుశ్శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.రోడ్డు మార్గం కల్పించడంతో ప్రజలకు స్కూలు వచ్చే విద్యార్థులకు ఎంతోగానో ప్రయోజనం చేకూరిందని ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లక్ష్మీ గణేష్ సర్పంచ్ ఊర్మిళ దేవికి కృతజ్ఞతలు తెలిపారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం కొబ్బరి చెట్టు కట్టిన వైరు

పంట చేలో ఒరిగిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి – ఆత్రేయపురం

కట్టుంగ గ్రామం నుండి నార్కెడిమిల్లి వెళ్లే ఆర్అండ్‌బి రహదారి చెంతనే ఉన్న పంట పొలంలో విద్యుత్ స్తంభం నేలకొరకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ వైరను తాత్కాలికంగా కొబ్బరి చెట్టుకు కట్టడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందని రైతులు భయాందోళన చెందుతున్నారు. ఎన్నిసార్లు విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించుకున్న పట్టించుకున్న దాఖలు లేవని రైతుల పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కలగజేసుకుని నేలకొరిగిన విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధరించి విద్యుత్ వైర్లను కొబ్బరి చెట్టు నుంచి తొలగించాలని రైతులు కోరుకుంటున్నారు

కార్టూ'నిజం'



దాళ్వా సాగుకు సిద్ధం కావాలి

మాట్లాడుతున్న ఏరువాకశాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి – రామచంద్రపురం

దాళ్వా సాగుకు రైతులంతా సిద్ధం కావాలని ఏరువాక శాస్త్రవేత్త కె.నందకిషోర్ పిలుపునిచ్చారు. కె. గంగవరం మండలం దంగేరు గ్రామంలో రబీ సాగుకు సమాయత్తం పై రైతులకు ఏర్పాటుచేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. విత్తనాల నాణ్యతను పరీక్షించుకోవాలని, వెదజల్లేటప్పుడు నీటి యాజమాన్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వనరుల కేంద్రం డిడి.జ్యోతిర్మయి మాట్లాడుతూ వరి విత్తనాలు కొనుగోలు చేయునపుడు బిల్లు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. విత్తన రకాలను నేల స్వభావం వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎడిఎ రంగారావు రబీ సీజన్లో సూక్ష్మ పోషకాలు, జింక్ వాడకం తప్పని సరి అని, తెలియజేశారు. ముడి జింక్ పిచికారీ రూపంలో ఉపయోగించు కోవచ్చు అని తెలియ జేశారు. కార్యక్రమంలో జిల్లా వనరులు కేంద్రం ఎఓ మనోహర్, మండల వ్యవసాయాధికారి బలుసు.రవి, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రీరామ చంద్ర మూర్తి, రాజా వంశీ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి

అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడుగా సురేష్

జిల్లా ఇంజినీరింగ్ అసిస్టెంట్ల నూతన కార్యవర్గం

ప్రజాశక్తి – ముమ్మిడివరం

ఉద్యోగ విధి నిర్వహణలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇంజినీరింగ్ అసిస్టెంట్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాలె సురేష్ నన్నారు. నగర పంచాయతీ పరిధిలోని అంబేద్కర్ కన్వెన్షన్ హాలు నందు ఆదివారం ఎన్నికలు రాష్ట్ర ప్రతినిధి, కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఆదివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర ప్రతినిధి, కాకినాడ జిల్లా అధ్యక్షుడు వై.గోవింద్ బాబు ఎన్నికల పరిశీలకునిగా హాజరై ఎన్నికలు నిర్వహించారు. కాలె సురేష్‌ను అధ్యక్షునిగా, అసోసియేట్ అసోసియేట్ అధ్యక్షునిగా మణికంఠ స్వామి, ప్రధాన కార్యదర్శిగా సాలెంరాజ్, కోశాధికారిగా శివరామ్, మహిళా కార్యదర్శిగా సింధుశ్రీ, వైస్ ప్రెసిడెంట్‌లుగా యేసు, రాజు, జాయింట్ సెక్రటరీలుగా వివేక్, వెంకటరమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా సంతోష్న సత్తిబాబు, టెక్నికల్ సెక్రటరీగా సురేంద్ర, జయకృష్ణ, మీడియా సెక్రటరీ లుగా సాయి కృష్ణ, సంతోష్‌ను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

నేరాలు ఘోరాలు

డీజిల్ తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

యానాం నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ఒక ఆటోను సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అమలాపురానికి చెందిన కుడిపూడి నరేష్, కేతా శ్రీనివాస్ తన ఆటోలో యానాం నుంచి రూ.80 వేలు విలువ గల వెయ్యి లీటర్లు టిన్నుల్లో అక్రమ డీజల్ తరలిస్తున్నారు.నగర పంచాయతీ పరిధిలోని కొండాలమ్మ చింత సమీపంలో ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా వీరు పట్టుబడ్డారు. దీంతో డీజిల్ తరలిస్తున్న ఆటోను సీజ్ చేసి డీజిల్ స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులపై నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ తెలిపారు.

బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జి.రాగంపేటలో ఆదివారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ పి.చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

బస్సును ఢీకొన్న కారు

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని మల్లేపల్లిలో ఆదివారం బస్సును కారు ఢీకొన్న సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. ఒక ప్రైవేట్ బస్సు మల్లేపల్లి డివైడర్ వద్ద యూటర్న్ తిరుగుతుండగా దివాన్ చెరువు నుండి అన్నవరం వెళుతున్న కారు బస్సును ఢీ కొంది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు ఉండగా ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో హాస్పిటల్‌కు తరలించారు. రోడ్డుకు అడ్డంగా బస్సు నిలిచి పోవడంతో అధిక సమయం జాతీయ రహదారిపై ఇరు వైపులా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీస్‌లు ట్రాఫిక్‌ని క్లియర్ చేశారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - గోపాలపురం

మనస్తాపానికి గురై వివాహిత ఫ్యాన్‌కి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గోపవరం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గోపవరం గ్రామానికి చెందిన అన్నెం వీరహారిక (20)కు రెండేళ్ల క్రితం తన మేనమామ కుమారుడితో ప్రేమ వివాహం జరిగింది. ఆమెకు ఏడాది వయస్సున్న కుమార్తె ఉంది. వీరి వివాహం జరిగినప్పటి నుంచి తల్లిదండ్రులు చూసేందుకు కూడా రాకపోవడంతో మనస్తాపానికి గురైంది. ఈ నేపథ్యంలో శనివారం ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమె తల్లి పేరం దుర్గ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ కేసు నమోదు చేశారు. తహాశీల్దార్ సిహెచ్.విద్యాపతి సమక్షంలో పంచనామా నిర్వహించారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

దివ్య ఆత్మహత్యపై డిఎస్‌పి దర్యాప్తు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

ఈ నెల 13న భర్త, అత్తమామల అదనపు కట్నం వేధింపులతో దుర్గాడలో రైలు నుండి దూకి ఆత్మహత్య చేసుకున్న తొగరు దివ్య కేసును తుని రైల్వే పోలీసుల నుంచి గొల్లప్రోలు పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. దీంతో గొల్లప్రోలు ఎస్ఐ పి.రామకృష్ణ కేసు నమోదు చేశారు. కాకినాడ డిఎస్‌పి రఘువీర్ దర్యాప్తు చేస్తున్నారు. దీంతో ఆదివారం ఆత్మహత్యా ప్రాంతాఇన్న డిఎస్‌పి పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

పోలేకుర్రు, పి.మల్లవరం రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు పోలేకుర్రు గ్రామానికి చెందిన శ్రవణ్ కుమార్ బైకుపై పి.మల్లవరం వెళ్లి తిరిగివస్తుండగా పోలేరమ్మ ఆలయ సమీపంలో తోటపేట గ్రామానికి చెందిన కొంకే సాయి సిద్ధార్థ బైకుపై వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శ్రవణ్ కుమార్ తల, మొహం, కాలిపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన తాళ్లరేవు సిహెచ్‌సికి తరలించి, ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేలు ఆడుతున్న నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సాగిపాడు గ్రామ సమీపంలో కోడిపందేల స్థావరంపై ఆదివారం దాడులు నిర్వహించి నలుగురుని అరెస్టు చేశామని ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు. రెండు కోడిపుంజులు, రెండు కోడి కత్తులు, రూ.3,409 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలు చేపడితే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

300 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

నాగులపల్లిలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు నాగులపల్లి సర్పంచ్ ఒడిశెట్టి గౌరీ రాజేశ్వరి నారాయణరెడ్డి తెలిపారు. కిరణ్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 50 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించినట్లు తెలిపారు. ఆపరేషన్ అవసరమైన వారికి కాకినాడలో ఉచితంగా కంటి ఆపరేషన్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొన్న కంటి వైద్యులకు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

యానాం వార్తలు

చిన్నారులతో ఎంఎల్‌సి త్రిమూర్తులు, ఎంఎల్‌ఎ అశోక్

తెలగా అభ్యుదయ సంఘం కార్తీక వన సమారా ధన

ప్రజాశక్తి-యానాం

యానాం తెలగా (కాపు) అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో కాపు కార్తీక వన సమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘం ప్రెసిడెంట్ కాటంశెట్టి వెంకట రామ్మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్తీక వనసమారాధనలో యానాం ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కాటంశెట్టి రామూర్తి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక సహపంక్తి వనభోజనాలు చేశారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. విజేతలకు ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

శ్రామికులకు అండగా ఈ శ్రమ్

అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వలీ

ముఖాముఖి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ఈ శ్రమ్ ద్వారా ప్రతీ ఒక్క శ్రామికుడికి ఎంతో మేలు కలుగనుంది. అసంఘటిత రంగ కార్మికులకు ప్రత్యేకంగా ఈశ్రమ్ పథకం గత 2021 ఆగస్టు 26న ప్రారంభమైంది. ఈ పథకంలో చేరితే అనేక ప్రయోజనాలున్నాయని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బిఎస్ఎం వల్లి తెలిపారు. కార్మిక శాఖ ఆధ్వర్యాన ఈ శ్రమ్ నమోదు కోసం ఇటీవల జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో పలు చోట్ల అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహించారు.

ఈ శ్రమ్ నమోదుకు అవగాహన కార్యక్రమాలు

ఈ శ్రమ్ నమోదుతో అసంఘటిత రంగంలోని ప్రతి ఒక్క శ్రామికునికీ మేలు జరుగుతుంది. ఈ నమోదుతో కార్మికులను గుర్తించి వారికి ఉపాధి కల్పించేందుకు ఈ శ్రమ్ చక్కగా ఉపయోగపడుతుంది. ఈ నేపథ్యంలో పలు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాము. కార్మికులు ఈశ్రమ్ ద్వారా పేర్లను నమోదు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలి. ఈశ్రమ్ వెబ్‌పోర్టల్‌లో నమోదు ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతోంది. నేషనల్‌డాటాబేస్ ఆఫ్ అన్ రికగ్నైజ్‌డ్ వర్కర్స్‌ను ఈశ్రమ్ ద్వారా నమోదు జరుగుతోంది.

రూ. 2 లక్షల ఉచిత బీమా..

ఈ శ్రమ్‌లో చేరిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వపరంగా అనేక ప్రయోజనాలు కల్పిస్తున్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందినా, శాశ్వతంగా అంగవైకల్యం కలిగిన వారికి రూ.2 లక్షల బీమా, పాక్షిక అంగవైకల్యం కలిగితే రూ.1 లక్ష బీమా ఉచితంగా అందిస్తూనే ఇతర ప్రయోజనాలు కల్పిస్తారు. ఈశ్రమ్ పోర్టల్‌లో చేరిన ప్రతి అసంఘటిత కార్మికునికీ 12 అంకెలు గల ప్రత్యేక గుర్తింపు కార్డు (యూనివర్సల్ ఐడెంటిఫికేషన్ నెంబరు) ఇస్తారు. ఈ కార్డు ఉంటేనే ప్రభుత్వం అందించే అన్నిరకాల సహాయం, సామాజిక భద్రత పథకాలు, సంక్షేమ పథకాలు అందుతాయి. అర్హులైన వారందరూ నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాం

ఉచితంగానే నమోదు ప్రక్రియ..

ఈ శ్రమ్ పథకంలో చేరేందుకు ఎలాంటి ఫీజు లేదు. ఉచితంగా కార్మికులు చేరవచ్చు. పేర్లు నమోదు చేసుకునేందుకు కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశం కల్పించాయి. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 3,20,855 మంది కార్మికులు ఈ శ్రమ్‌లో నమోదు చేయించుకున్నారు. అసంఘటిత కార్మికులందరినీ ఈశ్రమ్‌లో నమోదు చేయించడమే లక్ష్యంగా కార్మిక సంక్షేమ శాఖ అధికారులు పని చేస్తున్నారు. అసంఘటిత రంగంలో కార్మికులై ఉండి 16 నుంచి 59 ఏళ్ల వయస్సు లోపు వారు ఇందులో చేరవచ్చు. ఆదాయ పన్ను చెల్లించే వారు, ఇపిఎఫ్, ఇఎస్ఐ సదుపాయాలున్న వారు అనర్హులు.

మీసేవా, సీఎస్‌సి కేంద్రాల్లోనూ నమోదు..

అర్హులైన అసంఘటిత కార్మికులు అందరూ తమ ఆధార్ కార్డు నకలు, బ్యాంకు అకౌంట్ నెంటరు, సెల్ ఫోన్ నెంబరు వివరములతో సమీపములోని గ్రామ/వార్డు సచివాలయాలు, సిఎస్‌సి సెంటర్‌లలో లేదా ఈ శ్రమ్ అధికారిక పోర్టల్‌లో ఉచితంగా సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశం ఉంది. వెంటనే యాప్ యుఎఎన్‌తో కూడిన ఈశ్రమ్ కార్డును జారీచేస్తారు. ఆధార్‌తో లింకై ఉన్న ఫోన్ నెంబరు, బ్యాంకు అకౌంటు వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. యుఎఎన్ ఉన్న ప్రతి ఒక్కరికీ పిఎంఎస్‌బిఐ పథకం కింద రూ.2 లక్షలు, అంగవైకల్యం బీమా ఉచితంగా అందజేస్తారు. ఎలాంటి వివరాలు అవసరమైనా, లేదా అనుమానాలను నివత్తి చేసుకునేందుకు సంబంధిత కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించాలి.

ఈ శ్రమ్‌ను కార్మికులకు ఒక వరం..

ఈశ్రమ్ కార్యక్రమం శ్రామికులకు ఒక వరం లాంటిది. ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలి. అనేక ప్రయోజనాలున్న ఈశ్రమ్ పథకం అసంఘటిత రంగ కార్మికుల కోసం ప్రత్యేకంగా ప్రవేశపెట్టారు. అన్ని రంగాల కామన్ సెంటర్లలోనూ ఈశ్రమ్‌లో పేర్లు, వివరాలు నమోదు చేస్తారు. ఈశ్రమ్ కార్డు పొందితే ప్రభుత్వం అందించే అన్ని రకాల ప్రయోజనాలు చేకూరే అవకాశాలున్నాయి.

ఘనంగా శెట్టిబలిజ కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక సత్తెమ్మ తల్లి ఆలయం ఆవరణలో ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ వన కార్తీక సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగు రెండు రాష్ట్రాల్లో ఉన్న శెట్టిబలిజలను ఒకే వేదికగా తీసుకొచ్చి వారిలో ఐక్యత నింపే ఉద్దేశంతో, ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశామన్నారు. తమ ఆహ్వానాన్ని మన్నించి లక్షలాదిగా తరలి వచ్చిన కుటుంబ సభ్యులను చూసి మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. జనాభాలో అధిక శాతం ఉన్న బిసిలు ఐక్యంగా ఉంటూ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయ చైతన్యం కలిగి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలకు అతీతంగా తరలి వచ్చిన అశేష జన సందోహంతో కోనసీమ జిల్లా కోలాహలంగా మారింది. యువత కేరింతలు, బాణా సంచాలతో సభా ప్రాంగణం అంతా పండుగ, జాతర వాతావరణాన్ని తలపించింది. ఆత్మీయ సమారాధనకు అధ్యక్షత వహించిన మంత్రి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ జాతి ఐక్యత అభివద్ధి కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. తొలుత శెట్టిబలిజ జాతి పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో శెట్టిబలిజ నాయకులు సంఘ నాయకులు ఎంఎల్‌సి కూడిపూడి సూర్య నారాయణరావు, పెచ్చెట్టి చంద్రమౌళి, సివిల్ సప్లై డైరెక్టర్ కడలి ఈశ్వరి, శెట్టి బలిజ సంఘం డైరెక్టర్ డాక్టర్ చప్పిడి. వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి విజయలక్ష్మి, గుత్తుల సాయి, కట్ట మల్లేశ్వరరావు, చొల్లంగి వేణుగోపాల్, తదితరులు పాల్గొని మాట్లాడారు.

వనసమారాధలో ప్రసంగిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

'ధనవర్ష' టీమ్‌కి అవార్డు అందజేత

ప్రజాశక్తి - పి.గన్నవరం

పి.గన్నవరంలో 25 ఏళ్ల నుంచి మీ అచ్యువల్ కో ఆపరేటర్ సొసైటీ సభ్యులకు సేవలందిస్తున్నందుకు ధనవర్ష సొసైటీకి సినీ నటి కీర్తి సురేష్ అవార్డు అందజేశారు. హైదరాబాదులోని తాజ్‌కృష్ణ హోటల్లో శనివారం నిర్వహించిన సమావే శంలో సంఘ ఛైర్మన్ కంకిపాటి ప్రసాద్ సినీ నటి కీర్తి సురేష్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నట్లు కంపెనీ డైరెక్టర్ ఎమ్.త్రిమూర్తులుఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

'పి.గన్నవరం' ధనవర్ష సొసైటీ టీమ్‌కు అవార్డు అందజేస్తున్న సినీ నటి కీర్తిసురేష్

లయన్స్ ఆధ్వర్యాన వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

స్థానిక ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లో ఏలేశ్వరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సుగర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ సుగర్ వైద్య నిపుణులు డాక్టర్ విజయ్ కుమార్ రోగులకు వైద్య సేవలు అందించారు. రోగులకు రక్త పరీక్షలు నిర్వహించారు. సుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు అందజేయడంతో పాటు వ్యాధిగ్రస్తులు తీసుకోవాలిస్న జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎడివి.ప్రసాద్, ఊర రాజబాబు ఉన్నారు.

హాల్ టిక్కెట్లు ఇవ్వకపోతే చర్యలు తప్పవు

కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల కారణంగా జిల్లాలో ఏ డిగ్రీ, ఇంటర్మీడియట్ కళాశాలల్లో అయినా ఏ విద్యార్థికి హాల్ టిక్కెట్లు నిరాకరించడం, తరగతులకు లేదా ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాకుండా నిరోధిస్తే సంబంధిత కళాశాలలపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాల ఫీజు చెల్లించకపోవడం వల్ల కొంతమంది డిగ్రీ, ఇంటర్ కళాశాలల ప్రిన్సిపల్స్ విద్యార్థులకు సర్టిఫికెట్లను ఇవ్వకపోవడం, వారిని పరీక్షలను రాయనీకపోవడం జరుగుతోందని తమ దష్టికి వచ్చిందన్నారు. విద్యార్థుల సర్టిఫికెట్లను ఎలాంటి హోల్డ్ చేయకూడదని ప్రభుత్వం గైడ్లైన్స్ ఇచ్చిందన్నారు. ఎవరైనా కళాశాలల ప్రిన్సిపల్స్ విద్యార్థుల సర్టిఫికెట్లను హోల్డ్ చేయడం చేస్తే సంబంధిత కళాశాలను బ్లాక్ లిస్టులో పెడతామన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ఫీజును కళాశాలల అకౌంట్లలోకి జమ చేస్తుందని, త్వరలో ప్రభుత్వం జిఒ ఇస్తుందని అన్నారు. కళాశాలలకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఏ కళాశాలలోనూ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు పెట్టవద్దని కలెక్టర్ పేర్కొన్నారు.

వెంకన్న ఆలయ కమిటీకి నగదు అందజేస్తున్న పాపారావు

వెంకన్న ఆలయ నిర్మాణానికి రూ. 3.50 లక్షల విరాళం

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, మురళీకష్ణ సంస్థల అధినేత, కొత్తపేట నియోజకవర్గ రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వంటిపల్లి పాపారావు ఆదివారం వెంకన్న ఆలయ నిర్మాణానికి రూ.3.50 లక్షలు విరాళంగా అందజేశారు. రావులపాలెం మండలంలోని ఈతకోటలో పెద్ద చెరువుగట్టు సమీపంలో వెంకన్న ఆలయం నిర్మిస్తున్నారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు నిర్మాణ స్థితిగతులను పరిశీలించి, మూడు లక్షల 50 వేల రూపాయల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను అభినందిస్తూ సాలువా కప్పి పూలమాలలతో కమిటీ సభ్యులు సత్కరించారు. అలాగే పాపారావు చేస్తున్న సేవలను వారు అభినందించారు.

బాల బాలాజీ ఆలయానికి రూ.4.41 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానమునకు ఆదివారం రూ.4.41లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం సత్యనారాయణ రాజు ఒక ప్రకటనలో తెలిపారు ఇందులో నిత్యాన్నదాన ట్రస్ట్ కు రూ.55,307 ఆదాయం వచ్చిందన్నారు 6,578 మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా 4,259 మంది అన్న ప్రసాదం స్వీకరించారని ఆయన తెలిపారు.

మహాధర్నా జయప్రదానికి ప్రచారం

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

కాకినాడలో సోమవారం నిర్వహించే రైతు, కార్మిక, దళిత, చేతి వృత్తుల మహా ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం సిఐటియు నాయకులు గుర్రాల అప్పారెడ్డి, కాళ్ల నాగేశ్వరరావు కోరారు. ఈ సందర్భంగా ఆదివారం రమణక్కపేటలో రైతులకు కరపత్రాలను అందజేశారు. గ్రామంలో పర్యటించి రైతులు, కౌలు రైతులను కలిశారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను నాయకులకు వివరించారు. ధాన్యానికి మద్దతు ధర రావడం లేదని, కొనుగోలు కేంద్రాలు ఎక్కడున్నాయో కూడా తెలియదని, గోనె సంచులు లేవని, ప్రభుత్వ అధికారులు ఎవరూ కనబడడం లేదని రైతులు ఆవేదన చెందారు. గతంలో వచ్చిన ఏలేరు వరదల వల్ల గ్రామంలో పంట పొలాలు అన్నీ మునిగిపోయాయని, దీంతో దిగుబడి బాగా తగ్గిందని తెలిపారు. కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. కౌలు రైతులు మరీ తీవ్రంగా నష్టపోయారని ఆవేదన చెందారు. నేటికీ పెదఏరుకు పడ్డ గండ్లకు మరమ్మతులు చేయలేదని చంద్రబాబు ఇస్తానన్న అన్నదాత సుఖీభవ రూ.20,000 సాయం ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. రైతులు ధాన్యం ఆరబెట్టుకోవడానికి కనీసం స్థలం కూడా లేదని కావున ప్రభుత్వం స్థలాలు ఇప్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కె.సూరిబాబు, రాము, సత్తిబాబు, రైతులు పాల్గొన్నారు.

కార్మిక నాయకుడు గళ్లా రాము మృతి

ప్రజాశక్తి - అమలాపురం

పట్టణానికి చెందిన కార్మిక నేత గళ్లా రాము(70) ఆదివారం మరణించారు. దీర్ఘకాలంగా ఆయన అస్వస్థతకు గురయ్యారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆది నుంచి కార్మిక ఉద్యమాల్లో గళ్లా చురుకైన పాత్ర పోషించారు. 1983 నుంచి ఇప్పటివరకు టిడిపిలో కొనసాగుతున్నారు. టిడిపి ట్రేడ్ యూనియన్ సంక్షేమ బోర్డు సభ్యునిగా ఆయన రెండు దశాబ్దాలు పని చేశారు. నిత్యం కార్మిక సమస్య లు పై పోరు సలుపుతూ పలు సంఘాలకు గౌరవ అధ్యక్షులుగా పని చేశారు. రాము మృతికి అమలాపురం పట్టణ టిడిపి నాయకులు కార్యకర్తలు పట్టణ ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బొడ్డు వెంకటరమణ చౌదరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంఎల్‌ఎ వేగుళ్ల

రుడా ఛైర్మన్ 'బొడ్డు'కు సత్కారం

ప్రజాశక్తి - మండపేట

రుడా ఛైర్మన్‌గా నియమితులైన బొడ్డు వెంకటరమణ చౌదరిని ఆదివారం రాజమహేంద్ర వరంలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్,మండపేట ఎంఎల్‌ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణ చౌదరికి పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, మల్లిపూడి గణేష్, తదితర్లు పాల్గొన్నారు.

రాజ్యాంగమే దేశానికి దిక్సూచి

ప్రజాశక్తి - రాజోలు

భారతదేశానికి దిక్సూచి రాజ్యాంగమే కానీ, సనాతన ధర్మం కాదని హేతువాదసంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షులు పెన్మెచ్చ సుబ్బరాజు అన్నారు. ఆదివారం విశ్వేశ్వరాయ పురం అంబేద్కర్ భవన్ లో బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన నిర్వహించారు. సనాతన ధర్మమా రాజ్యాంగమా అనే అంశంపై సుబ్బరాజు ముఖ్య వక్తగా ప్రసంగించారు. ధర్మం అంటే మత ధర్మమే తప్ప మానవ ధర్మం కాదని, సనాతన ధర్మం అంటే వేదాలే తప్ప మనుధర్మం కాదని కొంతమంది చేస్తున్న వాదనలో వాస్తవం లేదన్నారు. వేదాల భాష్యాన్నే స్మృతులు చెబుతున్నాయని అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి సనాతన ధర్మం వ్యతిరేకమన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని ప్రతి పౌరుడు అలవార్చుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య వచ్చి 75 సంవత్సరాలు అయినప్పటికీ రాజ్యాంగంపై అవగాహన కొరవడిందన్నారు. నేటికీ వివక్ష కొనసాగుతోందని రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని కాపాడవలసిన బాధ్యత మనపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమం లో బత్తుల లక్ష్మణ రావు ముత్యాల శ్రీనివాసరావు, ఆకుమర్తి భూషణం, నల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు శతాధిక వృద్ధులు మృతి

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

లక్ష్మీకాంతమ్మ (ఫైల్)

మండలంలోని మలికిపురం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు బత్తుల లక్ష్మీ కాంతమ్మ (108) ఆదివారం మృతి చెందింది. ఆమెకు కొడుకు, కోడలు, ఐదుగురు ముని మనుమలు ఉన్నారు. 1917లో ఆమె అంతర్వేదిలో జన్మిం చారు. మరణించే వరకు ఆమె తన పనులు తాను చేసుకునే వారని లక్ష్మీకాంతమ్మ కుమారుడు బత్తుల శ్యామ్ శివరావు తెలిపారు. ఆమె మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. **ఆత్రేయపురం:** మండలంలోని ర్యాలి గ్రామానికి చెందిన శనక్కాయల అచ్చమ్మ (102) ఆదివారం సాయంత్రం మృతి చెందింది. ఈమెకు ఐదుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మనవరాలు, ముని మనవళ్లు ఉన్నారు. అచ్చమ్మ ఇప్పటి వరకూ ఎవరి మీద ఆధారపడకుండా తన పనులు తను చేసుకుంటూ తుది శ్వాస విడిచింది. ఆమె మృతికి పలువురు సంతాపం తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-గండేపల్లి

జాతీయ రహదారిపై దాబాలు, హోటల్స్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరిరాజు హెచ్చరించారు. శనివారం అర్ధరాత్రి ఆయన జగ్గంపేట సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు, హోటల్స్ వద్ద మద్యం సేవించినా, ఎటువంటి మద్యం అమ్మకాలు చేసినా చర్యలు తప్పవన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరగకుండా హోటల్స్ వద్ద వాహనాలను సక్రమంగా నిలుపుదల చేయించవలసిన బాధ్యత హోటల్ యాజమాన్యాలదేనని ఆయన తెలిపారు. హోటల్ వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల క్రైమ్ చేసే వారిని పూర్తిగా గుర్తించేందుకు ఎంతో అవసరం అవుతుందని తెలిపారు.

పలువురికి 'మానవత' ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పలువురు పేదలకు వైద్యం ఖర్చుల నిమిత్తం మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రూ.10వేల ఆర్థిక సాయం అందించింది. వేళ్లచింతలగూడెంలో కుక్కల గంగాజలం పక్షవాతాని గురయ్యాడు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4వేలను అందించారు. అదే గ్రామానికి చెందిన తొర్లపాటి రాజేంద్రకు డయాలసిస్ నిమిత్తం రూ.3వేలు అందించారు. బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా పక్షవాతంతో బాధపడుతున్న చినరత్తయ్యకు రూ.3వేలు అందించారు. ఈ కార్యక్రమంలో మానవత ఛైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, కో- ఛైర్మన్ నెల్లి చంద్రశేఖర్, సెక్రెటరీ కుక్కల కీర్తికుమార్, సిఆర్‌పి కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

గోడ పత్రికను ఆవిష్కరించిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - బిక్కవోలు

బిక్కవోలు సుబ్రహ్మణ్యం స్వామి షష్టికి సంబంధించిన గోడ పత్రికలను అనపర్తి ఎంఎల్‌ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిక్కవోలులో సుబ్రహ్మణ్య షష్టిని ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. చాళుక్యుల కాలం నుంచి ప్రాచుర్యం పొందిన ఆలయాన్ని టెంపుల్ టూరిజంలో భాగంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు.

కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఇటీవల రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ఏలేశ్వరం వార్డ్ కౌన్సిలర్ మూది నారాయణస్వామిని ఆదివారం పట్టణ మార్కెట్ జట్టు యూనియన్ కార్మికులు సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత మూది నారాయణస్వామి మాట్లాడుతూ తూర్పు కాపులను రాష్ట్ర ప్రభుత్వం బిసి-డిగా గుర్తించినా ఒబిసి సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో వేలాది మంది నిరుద్యోగ యువకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఒబిసి సర్టిఫికెట్లు నిలుపుదల చేయడం వల్ల కేంద్ర ప్రభుత్వ సంస్థలైన పోస్టల్, రైల్వే, ఎయిర్‌ఫోర్స్ వంటి సంస్థల్లో తూర్పు కాపులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయ నగరం జిల్లాల్లో తూర్పు కాపులకు ఒబిసి సర్టిఫికెట్లు ఇస్తుండగా ఉభయ గోదావరి జిల్లాల్లో ఇవ్వక పోవడం అన్యాయం అన్నారు. ఈ విషయాన్ని తూర్పు కాపు కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పాల్వంచ యశస్విని దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు రాజమహేంద్రవరం
O.S.No.297/2024
Between:
Indian Bank being represented by It's Assistant General Manager, Main Branch.Main Road, Innespeta, Rajamahendravaram
...Plaintiff
AND
1) M/s. Sai Srinivas Agencies rep by its proprietor Koppisetty Satya Srinivas, Son of Veera Venkata Satyanarayana, age years, D No.36-16-21, Near Manikanta Lab, Stadium RoadRajamahendravaram - 533 101.
2) Sri Koppisetty Satya Srinivas, Son of Veera Venkata Satyanarayana, aged years,D No.36-16-21, Near Manikanta Lab, Stadium Road Rajamahendravaram - 533 101
...Defendants
పై నంబరు దావాలో 1,2 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్సు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది.**03-12-2024** సం॥రం తేదీ ఉదయం **10.30** ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
రాజమండ్రి **బి.వి.రమణరావు**
24-11-2024 అడ్వకేట్,రాజమండ్రి

BEFORE THE STATE CONSUMER DISPUTE REDRESSAL COMMISSION OF ANDHRA PRADESH AT VIJAYAWADA
FIRST APPEAL No: 610 OF 2024
Between:
1. M/s. Aditya Builders, Represented by its Managing Partner, Mällisetti Sekhar Kumar,
2. Mallisetti Sekhar Kumar, S/o. Late Satyanarayana Kumar,
....Appellant/Opposite Party
Vs
Nadiminti Surya Seshalaxmi
....Respondents/Complainant
RESPONDENT ADDRESS:
Nadiminti Surya Seshalaxmi, W/o. late Agnihotrisastry, age 70 years, Hindu, Housewife, D. No. 8-13/3-7/2, Pratapnagar, Shirdisai street, Kakinada-4, E.G. District.
The above Appeal is filed by Appellant before the Hon'ble AP State. Consumer Disputes Redresal Commission at Vijayawada against Respondent/complainant. The Appeal is posted for your appearance of Respondent **on 30-12-2024 at 10.30 AM.** Respondent is advised to appear in person or with his Advocate for objections if any in the Appeal, failing which the Hon'ble State Commission may be pass appropriate order against you. This notice is issued according to the Orders of this Hon'ble State Commission on 13-11-2024.
DATE OF ADJOURNMENT: 30/12/2024, AT: 10.30 AM
JU BHASKRAM, Y S V PRATAP,
SPR KUMAR, RM VRR
(AP/2752/2007)
RAO & RAO ASSOCIATES, ADVOCATES, VIJAYAWADA.
8500014509